సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 12 । ఆగస్టు । 2025



ఆగిన ఆశల సౌధం

పేదల కల కలగానే మిగిలిపోతోంది. కూటమి ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణం ఆగిపోయింది.

- 8లో



అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ గ్రీవెన్స్‌లో జనం సమస్యలు ఏకరువు పెట్టారు. 86 మంది వినతులు సమర్పించారు.

- 8లో

నేడు, రేపు ఎన్‌ఎంయూ ధర్నా

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 12, 13 తేదీల్లో ధర్నా నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ జిల్లా కార్యదర్శి వై.అప్పయ్య తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పీఆర్‌సీ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు.

న్యూస్‌రీల్

నేడు నరసన్నపేటలో జాబ్‌మేళా

నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాల ప్రాంగణంలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. డక్కన్ ఫైన్ కెమికల్స్, యాక్సిస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, టీం లీజ్, డక్కన్ టీవీ, తోషిబా తదితర 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు మేళాలో ఇంటర్వ్యూలు నిర్వహించి వారికి కావాల్సిన వారిని ఎంపిక చేయనున్నారని తెలిపారు. టెన్త్, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఇంటర్వ్యూల్లో ఎంపికైన వారికి విజయనగరం, విశాఖ, హైదరాబాద్, శ్రీసిటీల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు వినియోగించుకోవాలని కోరారు.

పలాస సీజీఆర్ఎఫ్ క్యాంపు కోర్టులో 17 దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులను స్వీకరిస్తున్న బి.సత్యనారాయణ

పలాస: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ పరిధిలోని శ్రీకాకుళం సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక(సీజీఆర్ఎఫ్) కార్యక్రమంలో భాగంగా సోమవారం పలాస విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఆవరణలో క్యాంపు కోర్టు జరిగింది. ఈ సర్కిల్ పరిధిలోని వివిధ మండలాల నుంచి మొత్తం 17 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. కోర్టు చైర్ పర్సన్ విశ్రాంతి న్యాయమూర్తి బి.సత్యనారాయణ, పలాస ఈఈ యోగేశ్వరరావు, ఏడీఈలు కృష్ణమూర్తి, ఏఈలు నాగభూషన్, వివేక్, ఎల్ఐ కోదండరావు,లింగరాజు, నీలాద్రి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం



కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో మంగళవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఈ సందర్భంగా 1 నుంచి 19 ఏళ్ల వయసుగల వారందరికీ అల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందిస్తారని అన్నారు. మంగళవారం మాత్రలు వేసుకోకుండా మిగిలిపోయిన పిల్లలకు ఆగస్టు 20న మాప్-అప్ డే ద్వారా మాత్రలు అందజేస్తారని, పిల్లల ఆరోగ్యాన్ని మెరుగుపరచడం, వారి విద్యా ప్రగతికి తోడ్పడడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ వివరించారు. పాఠశాలకు వెళ్లని పిల్లలు, అంగన్‌వాడీల్లో నమోదు కాని పిల్లలు కూడా ఈ కార్యక్రమం ద్వారా మాత్రలు పొందవచ్చని ఆయన చెప్పారు. నులిపురుగుల నివారణ పిల్లల శారీరక, మానసిక వికాసానికి కీలకమని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చురుకుగా సహకరించి ప్రతి పిల్లకు మాత్ర వేయించేలా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు.

14న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు


అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈనెల 14న ఉదయం 10.30 గంటల నుంచి జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతాయని జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజా ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటల నుంచి 6వ స్థాయీ, 11.30 గంటలకు 3వ స్థాయీ, 12.30 గంటలకు 5వ, మధ్యాహ్నం 2 గంటలకు 2వ, 3 గంటల నుంచి 4వ స్థాయీ, 4 గంటల నుంచి 1వ స్థాయీ, 5 గంటల నుంచి 7వ స్థాయీ సంఘ సమావేశాలు ఆయా అధ్యక్షుల ఆధ్వర్యంలో జరుగుతాయని ఆయన తెలియజేశారు.

మందుబాబుకు 30 రోజులు జైలుశిక్ష

రణస్థలం: బంటుపల్లి గ్రామ పంచాయతీకి చెందిన మెన్నే శ్యామ్ కుమార్ మద్యం సేవించి వీరంగం సృష్టించిన నేపథ్యంలో కేసు నమోదు చేశామని జేఆర్ పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం .. ఆదివారం రాత్రి శ్యామ్ కుమార్ మద్యం సేవించి బహిరంగ ప్రదేశాల్లోని ప్రజలను ఇబ్బంది పెట్టేలా వ్యవహరించడంతో పాటు జేఆర్ పురం పోలీస్ స్టేషన్‌కు వచ్చిన పోలీస్ సిబ్బందితో ఇబ్బందికరంగా ప్రవర్తించడం, నానా రకాలుగా దుర్భాషలాడి వీరంగం చేశాడనే అభియోగంపై కేసు నమోదు చేసి జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హాజరు పరిచారు. దీనిపై న్యాయస్థానం 30రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ చిరంజీవి చెప్పారు.

స్వతంత్ర శ్రీకాకుళం

● 75 ఏళ్ల శ్రీకాకుళం జిల్లా ● సరిగ్గా స్వాతంత్ర్య దినోత్సవం నాడే జిల్లా అవతరణ



ఈ నేలకు గర్జించడం తెలుసు. ఈ మట్టికి శాంతి ప్రబోధించడం తెలుసు. ఈ గడ్డకు రోదించడం తెలుసు. ఈ భూమికి ఎదురించడమూ తెలుసు. శ్రీకూర్మ క్షేత్ర వైభవాన్ని ఈ ప్రాంతం చూసింది. శ్రీకాకుళం సాయుధ పోరాటానికి ఊపిరి పోసింది. అపురూప ఆదిత్య ధామంగా విరాజిల్లింది. జనం అమాయకులనే అపవాదును తరాల తరబడి మోసింది. గిడుగు వారి హయాం నుంచి అక్షరాన్ని కాపాడుతోంది. 75 ఏళ్లకు పూర్వం ఓ సూర్యాస్తమయాన 'శ్రీకాకుళం' పురుడు పోసుకుంది. 75 ఏళ్ల ప్రస్థానంలో ఎన్నో ఉత్థానపతనాలు చూసింది. కాలం రాసిన శ్రీకాకుళం కథ ఎప్పటికీ నిత్య నూతనమే. ఆ కాలాన్ని ఓ సారి వెనక్కి తిప్పితే..

– అరసవల్లి



నాటి జిల్లా కలెక్టర్ కార్యాలయం (ప్రస్తుతం జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న పాత భవనం)

ఉద్యమాల గడ్డగా ప్రసిద్ధి గాంచిన శ్రీకాకుళం జిల్లా అవతరించి 75 వసంతాలు పూర్తయ్యాయి. సామాజికంగా, రాజకీయంగా ఎంతో చరిత్ర కలిగిన శ్రీకాకుళం జిల్లా అవతరణ వెనుక ఎంతో ఘన చరిత దాగుంది.

- కుతుబ్‌షాహీల పాలనలో 'చికాకోల్' ఫౌజ్‌దారీ కేంద్రంగా ఏర్పాటైంది. దీని పరిధిలో ప్రస్తుత శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలతో పాటు ఒడిశాలోని కొన్ని ప్రాంతాలుండేవి. 1758లో విజయనగర జమిందార్ ఒత్తిడిపై ఇంగ్లిష్ సైన్యం తొలిసారి విశాఖపట్నంలో అడుగు పెట్టింది.
- 1759లో ఫౌజ్‌దారీ పాలనను అంతం చేసి బ్రిటిష్ పరిపాలన ప్రారంభమైంది.
- 1769 జూలై 27న 'వైజాగ్ పట్నం' పేరుతో వారు ఒక జిల్లాను ప్రకటించి, జిల్లా కేంద్రంగా విశాఖపట్నాన్ని ప్రకటించుకున్నారు. ఈ కొత్త జిల్లాలో ప్రస్తుత ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాలోని గంజాం జిల్లా దక్షిణ భాగం కూడా చేర్చారు.
- అప్పట్లో దేశంలోనే ఇదో అతి పెద్ద జిల్లాగా గుర్తింపు పొందింది. 1801లో కలెక్టర్ల పాలన జిల్లాలో ప్రారంభమైంది. భాష పేరుతో దేశాన్ని విభజించి పాలించడానికి బ్రిటిష్ పాలకులు నిర్ణయించి, 1936లో ఉమ్మడి మద్రాస్–ఒడిశా రాష్ట్రాలను విభజించారు.
- అయితే ఆంధ్రా, ఒడిశాల మధ్య సరిహద్దుల నిర్ణయం అప్పట్లో చర్చనీయాంశమైంది.
- విశాఖ, గంజాం జిల్లాలను ఒడిశాలో కలపాలని ప్రతిపాదించారు. దీనికి వ్యతిరేకంగా ఆంధ్ర ప్రాంతంలో 'వందేమాతరం–మనదే రాజ్యం' అనే నినాదంతో ప్రత్యేక ఉద్యమం మొదలైంది.
- ప్రత్యేకంగా బరంపురం, పర్లాఖిమిడి ప్రాంతాలు తెలుగు వారివే అని, వాటిని ఒడిశాలో చేర్చకుండా అడ్డుకోవాలని ఆంధ్రా నాయకులు నిశ్చయించుకున్నారు.
- 'శ్రీకాకుళం నుంచి శ్రీ పర్వతం దాకా తెలుగు వీర పవిత్ర తీర్థాలు సేవింప..' అంటూ మహాకవి వెంకటరత్నం ఒక పాటను రచించి, తెలుగు వారి ఉద్యమాన్ని ఉత్తేజపరిచారు.



- పర్లాఖిమిడి జమిందార్, బ్రిటిష్ అధికారులతో చేతులు కలిపినట్లు తెలియగానే, తెలుగు వారి ఆందోళన తీవ్రమైంది.
- పర్లాఖిమిడి, బరంపురంలను ఆంధ్ర రాష్ట్రానికి కేటాయించకపోతే, కటకం (కటక్) వరకు అడుగుతామని పేచికి దిగారు.
- వాడుక భాష కోసం పోరాటం జరిపిన గిడుగు రామ్మూర్తి పంతులు పోరాటానికి నడుం కట్టారు. రాష్ట్ర విభజన కోసం ఏర్పాటైన 'ఓడొనెల్ కమిటీ' ముందు పర్లాఖిమిడితో పాటు ఆ పరిసరాలన్నీ ఆంధ్రాకు చెందాలంటూ రామ్మూర్తి పంతులు గట్టిగా వాదించారు.
- దీంతో జమిందార్ ఆగ్రహించి 1932 ఫిబ్రవరిలో పంతులు కుమారుడు సీతాపతిని ఉద్యోగం నుంచి తొలగించారు. కానీ పంతులు సీతాపతిని ఎన్నికల్లో దించి పర్లాకిమిడి జమిందార్ బలపరిచిన అభ్యర్థులపై గెలిపించారు.
- సీతాపతి అప్పట్లో లండన్ వెళ్లి మరీ బ్రిటిష్ వారి ముందు తన వాదన వినిపించారు. కానీ జమిందార్లతో బ్రిటిష్ వారికి ఆ రోజుల్లో ఉన్న అవగాహన వల్ల పర్లాఖిమిడితో పాటు ఆ తాలూకాలోని మూడో వంతు ప్రాంతాన్ని ఒడిశాలో ఉంచుతూ నిర్ణయించారు.
- 1936లో ఒడిశా రాష్ట్రం ప్రత్యేకంగా ఏర్పాటైన తర్వాత రామ్మూర్తి పంతులు కలత చెంది వచ్చేశారు.

ఆ రోజే ప్రత్యేకం..

దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రత్యేక జిల్లాల కోసం ఉద్యమాలు పలు చోట్ల జరిగాయి. ప్రత్యేకంగా ఆంధ్ర ప్రాంతంలో అప్పటి వరకు వైజాగ్ జిల్లాలో భాగంగా ఉన్న శ్రీకాకుళంను ప్రత్యేక జిల్లా చేయాలంటూ 1948 నాటికే ఈ ప్రాంత నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. 1948 ఫిబ్రవరిలో శ్రీకాకుళం జిల్లా ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినా..జిల్లా కేంద్రం ఎంపికలో మాత్రం జాప్యం జరిగింది. ఈ క్రమంలో 1950 జులైలో అప్పటి రెవెన్యూ మంత్రి హెచ్.సీతారామరెడ్డి శ్రీకాకుళంను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. 1950 ఆగస్టు 15న సూర్యాస్తమయ సమయంలో పెట్రో మాక్స్ లైట్ల వెలుగులో శ్రీకాకుళం అవతరించింది.

1950 ఆగస్టు 15న సాయంత్రం 4.30 గంటల సమయంలో జిల్లా అవతరణ కార్యక్రమానికి కలెక్టర్ షేక్ అహ్మద్ తన నివాసం నుంచి ప్రస్తుతం జిల్లా కోర్టు భవన సముదాయంలో ఉన్న కలెక్టర్ కార్యాలయానికి బయల్దేరారు. దారి మధ్యలో ఆయన వాహనం చెడిపోవడంతో మరో వాహనంలో ఎక్కి వచ్చేసరికి సూర్యాస్తమయమై చీకటి అలముకుంది. అప్పటికప్పుడు పెట్రోమాక్స్ లైట్లలో అవతరణ కార్యక్రమాన్ని నాటి కలెక్టరేట్ (నేడు జిల్లా కోర్టు పాత భవనం) వద్ద ఘనంగా జరిపించారు. వేలాది మంది శ్రీకాకుళం వాసులు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవంతో పాటు జిల్లా ఆవిర్భావ దినోత్సవం జరిపే అపురూప అవకాశం దక్కింది.

కొండను కొల్లగొడుతున్నారు



కొండను తవ్వి గ్రావెల్‌ను లోడ్ చేస్తున్న దృశ్యం

● అక్రమంగా గ్రావెల్ తరలింపు

సంతబొమ్మాళి:

ఎలాంటి అనుమతులు లేకుండా మండలంలోని గోవిందపురం గ్రావెల్ కొండను కొల్లగొట్టి తరలించుకుపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతున్నా అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గోవిందపురం సర్వే నంబర్ 71లో కొండ నుంచి అక్రమంగా 33 టిప్పర్ల ద్వారా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకపోయినా దౌర్జన్యంగా గ్రావెల్‌ను తరలించి లక్షల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ తరలింపును గతంలో ప్రశ్నించిన స్థానిక సర్పంచ్, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శులకు నిర్వాహకులు విశ్వసముద్రం సంస్థ ద్వారా మూలపేట పోర్టు పనులకు గ్రావెల్‌ను తరలిస్తున్నామని చెప్పారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఎలా తరలించుకుపోతున్నారని ప్రశ్నించినా వినకుండా దౌర్జన్యంగా రోజుకు వందల లోడ్లను రాత్రి, పగలు తేడా లేకుండా తీసుకొని వెళ్లిపోతున్నారు. ఆర్డర్ కాపీ కావాలంటే అధికారులకు అడిగి తీసుకోండని దురుసుగా సమాధానం ఇస్తున్నారు. రాత్రి పగలు టిప్పర్ల ద్వారా తరలించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై ఎవరికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అయితే సర్వే నంబర్ 71లో ఉన్న ఈ కొండను గ్రామానికి చెందిన మండపాక నర్సింగరావు 2020–30 సంవత్సరం వరకు లీజుకు తీసుకున్నారు. ఏటా హెక్టార్‌కు రూ. 65వేలు ప్రభుత్వానికి చెల్లిస్తున్నామని లీజు దారుడు తెలియజేశారు. లీజుకు ఇచ్చిన గ్రావెల్ కొండను ఇతరులు తరలించుకు పోతున్నారని జిల్లా మైన్స్ విజిలెన్సు, రెవెన్యూ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకుండా పోయిందని లీజు దారుడు తెలియజేశారు. మైన్స్ విజిలెన్స్ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని అంటున్నాడు. పోర్టు పేరుతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ గ్రావెల్‌ను తరలించుకు పోయి కొందరు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు.

హైకోర్టులో కేసు వేశారు

కింజరాపు కుటుంబీకుల కనుసన్నల్లోనే గ్రావెల్‌ను అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా తరలించుకుపోతున్నారు. లీజుదారుడైన నన్ను సంప్రదించకుండా దౌర్జన్యంగా గ్రావెల్‌ను తీసుకువెళ్తున్నారు. జిల్లా మైన్స్ విజిలెన్స్, రెవెన్యూ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీనిపై హైకోర్టులో కేసు వేశాను.

– మండపాక నర్సింగరావు, లీజు దారుడు, వల్లే వలస

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం

గ్రావెల్ తవ్వకాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తాము. లీజుదారుడికి ఇచ్చిన 11 ఎకరాల్లో గ్రావెల్‌ను తరలించుకోవచ్చు. ఇతరులకు అనుమతులు ఉన్నాయో లేవో మైన్స్ అధికారులను అడిగి తెలుసుకుంటాను.

–హేమసుందర్‌రావు, తహసీల్దార్, సంతబొమ్మాళి

● ఇంటింటా తిరంగా..!



ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో సూర్య మహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల జంక్షన్ వరకు జరిగిన జాతీయ పతాక ర్యాలీని ఆయన ప్రారంభించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ, 'హర్ ఘర్ తిరంగా'లో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాలని కోరారు. జాతీయ పతాకాన్ని ఇంటిపై ఎగురవేయడంతో పాటు, సెల్ఫీ పాయింట్లను ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో జెండాతో ఫొటోలు తీసి హర్ ఘర్‌తిరంగా.కామ్/సెల్ఫీలో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వలంటీర్‌గా సేవలందించాలంటే హర్‌ఘర్ తిరంగా.కామ్/బికమ్ వలంటీర్ వెబ్‌సైట్‌ల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

జిల్లా వజ్రోత్సవాలకు సన్నద్ధం

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా కేంద్రంలో ఈ నెల 13 నుంచి 15 వరకు జరగనున్న 75వ శ్రీకాకుళం జిల్లా ఆవిర్భావ వజ్రోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం కోడి రామ్మూర్తి స్టేడియంలో వేడుకల ఏర్పాట్లను స్వయంగా పరిశీలించిన ఆయన, విద్యుత్ సరఫరా నిరంతరాయంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖకు సూచించారు. ఎవరికైతే బాధ్యతలు కేటాయించారో, వారు వాటిని సమయానికి, సక్రమంగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

వజ్రోత్సవాల కార్యక్రమాల షెడ్యూల్

- 13 ఉదయం 7 గంటలకు రన్ ఫర్ శ్రీకాకుళం. ఉదయం 11 నుంచి 1 గంట వరకు ఇన్వెస్టర్లతో సమావేశం. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు కేఆర్ స్టేడియంలో స్వర్ణ శ్రీకాకుళం ఫెయిర్ ఎగ్జిబిషన్.
- 14న ఉదయం 9 నుంచి మున్సిపల్ హైస్కూల్ మైదానంలో క్రీడా పోటీలు. ప్రభుత్వ మెన్ డిగ్రీ కళాశాలలో ఎస్సే రైటింగ్, క్విజ్, డ్రాయింగ్ పోటీలు. సాయంత్రం 5 నుంచి రాత్రి 9 వరకు స్వర్ణ శ్రీకాకుళం ఎగ్జిబిషన్.
- ఆగస్టు 15 ఉదయం 9 నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో స్వాతంత్ర్య వేడుకలు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రముఖ వ్యక్తులకు సత్కారం, సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

కళకళలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్

శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ సోమవారం ప్రయాణికులతో కళకళలాడింది. శుక్రవారం వరలక్ష్మి వ్రతం, రెండో శనివారం, ఆదివా రం వరుసగా మూడు రోజులపాటు సెలవులు కావడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు, ప్రయాణికులు తిరిగి వారి ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో కాంప్లెక్స్ కిటకిటలాడుతూ కనిపించింది.

–శ్రీకాకుళం అర్బన్



నాన్‌స్టాప్ క్యూ లైన్లలో బారులు తీరిన ప్రయాణికులు



నాన్‌స్టాప్ పోర్టికో వద్ద..



పోర్టికో ఆవరణలో రద్దీ

అనాథల దత్తతపై అవగాహన

శ్రీకాకుళం పాతబస్టాండ్: అనాథ పిల్లలకు కుటుంబ సంరక్షణ కల్పించే ఉద్దేశంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ దత్తతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమం, సాధికారత శాఖ మిషన్ వాత్సల్య పథకం కింద నిర్వహిస్తోంది. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్ ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. తల్లిదండ్రులు లేని లేదా సంరక్షణ అవసరమైన పిల్లలకు తాత్కాలికంగా లేదా శాశ్వతంగా కుటుంబ పెంపకం అందించే విధానమే ఫోస్టర్ కేర్ అని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వివరించారు. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా స్థిరంగా ఉన్న దంపతులు లేదా ఒంటరి మహిళలు/పురుషులు ఈ పిల్లలకు తమ ఇంట్లో ఆశ్రయం కల్పించి, వారికి ప్రేమ, ఆప్యాయత, భద్రత ఇవ్వవచ్చని తెలిపారు.

దత్తత విధానం

ఫోస్టర్ కేర్‌లో కనీసం రెండేళ్ల పాటు పెంచిన పిల్లలను, నిర్దేశిత ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారం శాశ్వతంగా దత్తత తీసుకోవచ్చని కలెక్టర్ వివరించారు. భారతీయ పౌరులైన దంపతులు లేదా ఒంటరి మహిళ/పురుషులు అర్హులని తెలిపారు. దరఖాస్తుదారులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, ఎలాంటి నేర చరిత్ర ఉండరాదని తెలిపారు. మరింత సమాచారం కోసం జిల్లా బాలల రక్షణ అధికారి 7901597211, రక్షణాధికారి (ఎన్.ఐ.సి.) 9849530982, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

● పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



హిరమండలం: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులు అందుబాటులో లేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని మండిపడ్డారు. ఎకరాకు 25 కిలోల యూరియా అందించాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడం ఏంటని ప్రశ్నించారు. గొట్టా బ్యారేజీలో నీటి స్థిరీకరణలో కూడా ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులకు ఇబ్బంది లేకుండా చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రైతులను కూటమి ప్రభుత్వ దారుణంగా వంచించిందని విమర్శించారు. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో ఎరువులు అందించకపోతే, వైఎస్సార్‌సీపీ తరుపున ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

మెరుగైన వైద్య సేవలు అందజేయాలి



వైద్య సేవలపై ఆరా తీస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

టెక్కలి: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేయాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. సోమవారం టెక్కలి జిల్లా ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అన్ని విభాగాలను పరిశీలించి అక్కడ పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు. అలాగే వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించి మెరుగైన వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో సిబ్బందితో మాట్లాడారు. ఆయనతో పాటు ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యారావు, నాయకులు బి.శేషగిరి, కె.లవకుమార్, ఎం.రాము తదితరులు ఉన్నారు.

‘27లోగా దరఖాస్తు చేయండి’

అరసవల్లి: అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయంలో ధర్మకర్తల పాలక మండలి నియామకాలకు దేవదాయ శాఖ నోటిఫికేషన్‌ను ఈనెల 7న విడుదల చేసిందని, ఈ మేరకు ఆసక్తి గలవారు ఈనెల 27లోగా తమ దరఖాస్తులను ఆలయానికి సమర్పించాలని ఆలయ ఈఓ కేఎన్‌వీడీవీ ప్రసాద్ తెలియజేశారు. ధర్మకర్తలకు కచ్చితమైన అర్హతలుంటాయని, వీటి ప్రొఫార్మా–2 ప్రకారం దరఖాస్తులను అన్ని ధ్రువపత్రాలతో సహా కార్యాలయానికి స్వయంగా గానీ పోస్టల్ రూపంలో గానీ అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి వారి ఆలయ కార్యాలయ అడ్రస్‌కు పంపించాలని కోరారు. మరిన్ని వివరాలకు 9491000708, 8978914660 నంబర్లకు సంప్రదించాలని ఆయన తెలియజేశారు.


తాడేపల్లిలో ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం ధర్నా రేపు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 13న తాడేపల్లిలోని సోషల్ వెల్ఫేర్ కార్యాలయం వద్ద శాంతియుత ధర్నా నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.జయరాం, ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరాజు, గౌరవాధ్యక్షుడు కె.గుండారెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండేళ్లుగా మూడు విడతల ఆర్‌టీఎఫ్, 2024–25 విద్యాసంవత్సరానికి గాను మూడు విడతల ఆర్‌టీఎఫ్ కలిపి మొత్తంగా ఆరు విడతల ఆర్‌టీఎఫ్ నిధులు విడుదల చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేయడం విచారకరమన్నారు. ఈ విషయమై కూటమి ప్రభుత్వ పెద్దలు, ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోకపోవడంతో గత్యంతరం లేని పక్షంలో బుధవారం ధర్నా చేయనున్నామని తెలిపారు.

మహిళ మెడలో చైన్ చోరీ

రణస్థలం: మండలంలోని అర్జునవలస పంచాయతీ పరిధి గిడిజాలపేట పరిధిలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ మెడలో గుర్తు తెలియని వ్యక్తి చైన్ లాక్కొని పరారైనట్లు జేఆర్ పురం పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి చెందిన అలిగిరి శ్రీజ విజయనగరం జిల్లాలోని నెల్లిమర్ల మహారాజ కళాశాలలో హోమియోపతి నర్సింగ్ చదువుతోంది. శ్రీకాకుళంలోని ఇంటి నుంచి స్కూటీపై బయల్దేరిన శ్రీజ రణస్థలం మండలంలోని అర్జునవలస పంచాయతీ పరిధి గిడిజాలపేట రహదారిపై వెళ్తుండగా, సాయంత్రం 5 గంటల సమయంలో వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి మెడలోని తులం బంగారం చైన్ లాక్కొని నెల్లిమర్ల వైపు పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ ఎస్.చిరంజీవి తెలియజేశారు.

ఆగిన ఆశల సౌధం..!



బెండిగేటు వద్ద జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లు

- కూటమి ప్రభుత్వంలో ఆగిన ఇళ్ల నిర్మాణాలు
- కొత్త ఇళ్ల మంజూరుకు మోకాలడ్డు
- నిర్మాణాలకు బిల్లుల చెల్లింపులు నిలిపివేత
- జగనన్న కాలనీలపై వివక్ష
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



గరుడఖండి వద్ద జగనన్న కాలనీ

వజ్రపుకొత్తూరు రూరల్: ప్రతి పేదవాడికి సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన పేదలకు ఇంటిస్థలం అందించి జగనన్న కాలనీల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులకు ఆర్థిక సాయం అందజేయడంతో పాటు నిర్మాణాలకు సంబంధించి మహిళలకు రుణ సదుపాయం సైతం అప్పటి ప్రభుత్వం కల్పించింది. దీంతో కాలనీల్లో వేగవంతంగా నిర్మాణాలు చేపట్టారు. చాలా మంది ఇళ్లను నిర్మించుకొని సొంతిట్లో ఆనందంగా గడుపుతున్నారు. అలాగే సొంత స్థలాల్లో సైతం పలువురు ఇళ్ల నిర్మాణాలకు పూనుకున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదల ఇళ్లపై శీతకన్ను వహిస్తోంది. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. కొంతమంది లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణం చేపడుతున్న తరుణంలో ఎన్నికలు వచ్చాయి. అయితే అనంతరం వచ్చిన కూటమి ప్రభుత్వం బిల్లుల చెల్లింపుల్లో మోకాలడ్డుతోంది. దీంతో ప్రస్తుతం లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో...

వైఎస్సార్‌సీపీ హయాంలో జిల్లావ్యాప్తంగా 81,262 మంది లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేశారు. ప్రభుత్వం గృహ నిర్మాణశాఖ ద్వారా రిజిస్ట్రేషన్లు కూడా పూర్తి చేసింది. అలాగే ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి సంబంధించి రూ.1.80 లక్షలు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది. అంతేకాకుండా మహిళా సంఘాల నిధుల్లో మహిళ లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా మరో రూ.35 వేల రుణ సదుపాయం కల్పించింది. అలాగే ఇంటి నిర్మాణానికి అవసరమైన సిమెంట్‌ను తక్కువ ధరలో అందించారు. నాణ్యమైన ఇంటి సామాగ్రిని సైతం అందించి లబ్ధిదారులకు అండగా నిలిచింది. దీంతో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపి, శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకొని వారి సొంత ఇంటి కలను నెరవేర్చుకున్నారు.

కాలనీలపై కూటమి కక్ష

జగనన్న కాలనీల్లో కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి చేపడుతున్న నిర్మాణాలపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోంది. బిల్లుల చెల్లింపులు లేకపోవడంతో పాటు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహకారం లేకపోవడంతో ఇంటి నిర్మాణాలు ప్రస్తుతం మొండి గోడలతో దర్శనమిస్తున్నాయి. దీంతో ఇప్పుడు ఏం చేయాలో తెలియక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. మరోవైపు ఇంటి నిర్మాణాలు జరగని కొన్నిచోట్ల ఆ స్థలంపై కూటమి నాయకుల కన్ను పడింది. వాటిని కబ్జా చేసేందుకు పన్నాగాలు పన్నుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే కొంతమంది లబ్ధిదారుల నుంచి చౌకగా ఇంటి స్థలాన్ని లాక్కొనే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించకుండా కూటమి ప్రభుత్వం వివక్ష చూపుతోంది.

జిల్లాలో గత ప్రభుత్వంలో...

- మంజూరైన మొత్తం ఇళ్లు – 81,262
- జగనన్న కాలనీ లే అవుట్‌లు – 784
- జగనన్న కాలనీల్లో మంజూరైన ఇళ్లు – 33,295
- పలు స్కీముల ద్వారా మంజూరైన ఇళ్లు – 47,967
- నిర్మాణం పూర్తయిన ఇళ్లు – 44,930
- పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాలు – 36,332
- పనులు ప్రారంభం కాని ఇళ్లు – 17,268
- బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్న ఇళ్లు – 7,921
- ఆర్‌ఎల్ స్థాయిలో ఉన్న ఇళ్లు – 4,434
- గుంతల తవ్వి వదిలేసిన ఇళ్లు – 3,930
- శ్లాబ్ పూర్తయిన ఇళ్లు – 2,772

వెబ్‌సైట్‌లో మార్పు.. లబ్ధిదారుల నిట్టూర్పు

గత ప్రభుత్వం వినియోగించిన గృహ నిర్మాణశాఖ వెబ్‌సైట్‌ను అధికారంలోకి వచ్చాక కూటమి ప్రభుత్వం లాక్ చేసింది. వెబ్‌సైట్‌ను సైతం మార్పులు చేసి లబ్ధిదారులకు నిట్టూర్పు మిగిల్చింది. లబ్ధిదారుల దరఖాస్తు, ఎంపిక, బిల్లు చెల్లింపులో జాప్యం కలిగేలా ప్రభుత్వ వైఖరి ఉందని, దీంతో తమ సొంతింటి కల నెరవేరడం లేదని పలువురు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి కొత్త ఇళ్లను మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లును అందించాలని కోరుతున్నారు.

డిసెంబర్‌లోగా పూర్తి చేయాలి

ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు డిసెంబర్‌లోగా నిర్మాణ పనులు పూర్తి చేయాలి. ఇళ్ల నిర్మాణం కోసం గత ప్రభుత్వం అందించిన రూ.1.80 లక్షలతో పాటు అదనంగా బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలను ప్రస్తుత ప్రభుత్వం అందిస్తుంది. అర్హులైన లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఇళ్లు నిర్మాణం చేస్తే బిల్లులు అందిస్తున్నాం.

– అప్పారావు, గృహ నిర్మాణశాఖ పీడీ, శ్రీకాకుళం

చంపుతామని భయపెట్టి దోచేశారు

- అధిక వడ్డీలతో రూ.1.52 కోట్లు కాజేశారు
- ఆధారాలతో ఎస్పీకి ఫిర్యాదు చేసిన వైద్యుడు

శ్రీకాకుళం క్రైమ్: తనను కొంతమంది వ్యక్తులు భయపెట్టి రూ.1.52 కోట్లు దోచేశారని, కులం పేరుతో దూషించి కొట్టడమే కాకుండా కుటుంబంతో సహా చంపుతామని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని నగరంలోని న్యూకాలనీకి చెందిన కొత్తపల్లి సాయివివేక్ సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. సాయివివేక్‌కు పీఎన్‌కాలనీకి చెందిన పైలా చంద్రశేఖర్ (కుంగ్‌ఫూ శేఖర్) 2014లో పరిచయమయ్యారు. 2021 నుంచి 2023 అక్టోబర్ వరకు రాగోలు జెమ్స్‌లో కాంట్రాక్టు పద్ధతిలో మెడికల్ ఆఫీసర్‌గా సాయివివేక్ పనిచేసే సమయంలో చంద్రశేఖర్ తనకు ఏ అవసరమైనా సాయపడతానని చెప్పడంతో సరేనన్నాడు. దీనిలో భాగంగా 2023 నవంబర్‌లో సొంత అవసరాల నిమిత్తం రూ.35 లక్షలు అప్పు సాయివివేక్ అడగడంతో, చంద్రశేఖర్ అతని మిత్రులు వాండ్రంగి కృష్ణచైతన్య, నగిరెడ్డి సాయికుమార్, జనపరెడ్డి సన్యాసిరావుల అకౌంట్ల నుంచి నగదు పంపించాడు. దీనికి సంబంధించి బాండ్ పేపర్లు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు చంద్రశేఖర్ వద్దే ఉంచుకున్నాడు. బాండ్ పేపరులో రూ.2 లకు వడ్డీ పేరిట చంద్రశేఖర్ రాయించుకున్నాడని, ఆ తర్వాత ఎప్పుడు డబ్బులు వేయాలన్నా.. తన భార్య హిమబిందు అకౌంట్‌కే వేయాలని చంద్రశేఖర్ చెప్పడంతో 2023 నవంబర్ నుంచి 2024 జూలై వరకు అసలు, వడ్డీతో కలిపి క్లియర్ చేయడం జరిగిందని సాయివివేక్ తెలియజేశారు. అయినప్పటికీ రూ.10ల అధిక వడ్డీతో డబ్బులు ఇవ్వాలని బెదిరించడం, ఒకానొక సందర్భంలో తనవద్దనున్న ప్రామిసరీ నోట్లు, బాండ్లు ఇస్తానని ఇంటికి పిలిపించి కొరడాతో కొట్టడం, చంపుతామని బెదిరించడం చేశాడన్నారు. దీంతో చేసేదేమీలేక చంద్రశేఖర్ భార్యకు రూ.1.01 కోట్లు, నగిరెడ్డి సాయికి రూ.17.40 లక్షలు, కృష్ణచైతన్యకు రూ.5,87,700లు, జనపరెడ్డి సన్యాసిరావు (తాతాజీ)కి రూ.31,99,850లు కార్‌లోన్, హోమ్‌లోన్లతో కలిపి ఆన్‌లైన్‌లో వేయడం జరిగిందని తెలియజేశారు.

మోసగాడిగా చిత్రీకరించారు

వేధింపులు భరించలేక గత నెల జూలై 8వ తేదీన డబ్బులిచ్చేది లేదని చెప్పేశానని పేర్కొన్నారు. దీంతో చంద్రశేఖర్ తన వద్దనున్న చెక్కులతో కొందరి స్నేహితులు తనకు అప్పులు ఇచ్చినట్లుగా సృష్టించడంతో పాటు వివిధ పత్రికల్లో తనను మోసగాడిగా చిత్రీకరించాడన్నారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన ఈనెల 2వ తేదీన కుషాయిగూడలో ఆత్మహత్యాయత్నం చేశానన్నాడు. తానుండేది నేరేడుమెట్ట పరిధి కావడంతో రాచగుంట పీఎస్‌లో కేసు నమోదైందని సాయివివేక్ పేర్కొన్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో ఎస్పీ మహేశ్వరరెడ్డికి కలిసి న్యాయం చేయాలని కోరడంతో పాటు చంద్రశేఖర్ తనను మానసికంగా, శారీరకంగా వేధించిన ఆధారాలు, బ్యాంకు లావాదేవీల ఆధారాలన్నీ పెన్‌డ్రైవ్‌లో పొందుపరిచి సమర్పించాడు. వెంటనే ఎస్పీ మహేశ్వరరెడ్డి రెండో పట్టణ సీఐ పి.ఈశ్వరరావుకు సమస్యను మూడు రోజుల్లో పరిష్కరించమని ఆదేశాలిచ్చారు. ఇదే విషయం సీఐ ఈశ్వరరావు వద్ద సాక్షి ప్రస్తావించగా సివిల్ మ్యాటర్ అని, విచారణ చేస్తున్నామన్నారు.

అమ్మో.. ఆస్పత్రి

శ్రీకాకుళం నగరంలోని ఫాజుల్ బేగ్‌పేటలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్ దుస్థితి దారుణంగా ఉంది. ఆస్పత్రి పరిసరాలను చూసి రోగులు రావడానికి కూడా భయపడుతున్నారు. ఆస్పత్రి కూలిపోయిన గోడలతో దర్శనమిస్తుండగా.. చుట్టూ పొదలు అల్లుకొని రోగులను భయపెడుతూ ఆహ్వానిస్తున్నాయి. అందువలన అధికారులు స్పందించి ఆస్పత్రి పరిసరాలను ఆహ్లాదకరంగా మార్చాలని పలువురు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం







పోలీసుల అదుపులో నిందితులు..?

సాక్షి టాస్క్‌ఫోర్స్: పాతపట్నం మేజర్ పంచాయతీ మొండిగల వీధికి చెందిన నల్లి రాజు మృతదేహం ఈనెల 7వ తేదీన అనుమానాస్పద స్థితిలో దొరికిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు గత ఐదు రోజులుగా పలు కోణాల్లో దర్యాప్తు చేయడంతో కేసు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి పోలీసు అదుపులో నలుగురు వ్యక్తులు ఉన్నట్లు సమాచారం. వారిలో ఒక మహిళతో పాటు ముగ్గురు వ్యక్తులు ఉన్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి.

గంజాయితో ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

టెక్కలి రూరల్: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను సోమవారం టెక్కలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గుణుపూర్‌కు చెందిన విశాల్ కేశరి సమాల్, మూనలిమ్మ అనే ఇద్దరు వ్యక్తులు కొరాపుట్‌కు చెందిన ముఖేష్ బాగ్ అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేశారు. అనంతరం గుణుపూర్ నుంచి ట్రైన్‌లో టెక్కలి వచ్చి అక్కడి నుంచి విశాఖపట్నం వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే ముందస్తు సమాచారం మేరకు సీఐ తన సిబ్బందితో కలిసి రైల్వేగేటు సమీపంలోని బాపినాయుడు కాలనీ వద్ద వారిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా వారి వద్ద నుంచి 9.25 కేజీల గంజాయి పట్టుబడింది. వీరు గోవాకు చెందిన వినాయక్ బాలచంద్ర చౌహాన్ అనే వ్యక్తికి ఈ గంజాయి అప్పగించేందుకు వెళ్తుండగా పట్టుబడ్డారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కిక్ బాక్సింగ్‌లో సత్తా



చిన్నారికి మెడల్, బహుమతులను అందజేస్తున్న కలెక్టర్

పొందూరు: మండలంలోని రాపాక గ్రామానికి చెందిన ఎచ్చెర్ల కీర్తన కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటింది. ఈ నెల 10వ తేదీన విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ బాక్సింగ్ హాల్‌లో హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్–10 బాలికల విభాగంలో కీర్తన ప్రతిభ కనపరిచి రెండో స్థానం కైవాసం చేసుకుంది. ఈ బాలికకు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మెడల్, బహుమతులను సోమవారం శ్రీకాకుళంలో అందించారు. చిన్నారి ఎచ్చెర్ల గురుకులంలో 5వ తరగతి చదువుతోంది.

అర్జీలు సత్వరమే పరిష్కరించాలి



అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- పీజీఆర్‌ఎస్‌కు 86 వినతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: అర్జీలు పెండింగ్‌లో లేకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో 86 వినతులు స్వీకరించారు. వీటిలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంఘం, రెవెన్యూ (సీసీఎల్ఏ) విభాగం, వ్యవసాయ శాఖ, ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్, సర్వే, ల్యాండ్ రికార్డ్స్, పంచాయతీరాజ్, మున్సిపల్ యాజమాన్యం, సామాజిక సంక్షేమం, ఎండోమెంట్స్, నీటిపారుదల, పరిశ్రమలు, గృహ నిర్మాణం, సమగ్ర శిక్ష, ప్రజారోగ్యం, నైపుణ్యాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామ వలంటీర్లకు సంబంధించిన వినతులు ఉన్నారు. స్వీకరించిన అన్ని వినతుల పరిష్కారానికి సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ ఆదేశించారు.

ఫిర్యాదులను పరిశీలిస్తే...

- వంశధార కాలువ ద్వారా పలాస నియోజకవర్గంలోని శివారు ప్రాంతాలకు సాగునీరు రావడం లేదని, వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కాలువ నీరు ఎంతో అవసరం ఉందని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. తమ నియోజకవర్గానికి కాలువ ద్వారా సాగునీరు అందించాలని కోరారు. ఎగువనున్న నరసన్నపేట, టెక్కలి ఎమ్మెల్యేల ప్రోత్సాహంతో కాలువ గేట్లు రాత్రికి రాత్రి ఎత్తివేసి, పలాస నియోజకవర్గానికి సాగునీరు రాకుండా చేస్తున్నారని ఆమె వాపోయారు.
- శ్రీకాకుళం పట్టణంలోని సర్వే నంబర్ 190/2లో ప్రభుత్వ పురుషుల డిగ్రీ రోడ్డులో వికాస్ స్కూల్ దగ్గర బలగ వార్డు స్థలంలో డాక్టర్ గొండు గంగాధర్ అక్రమ నిర్మాణం చేపడుతున్నాడని, నిర్మాణ పనులు ఆపమని ఉన్నత న్యాయస్థానం చెప్పినా పట్టించుకోవడం లేదని శాంతి నగర్‌కు చెందిన లోతుగెడ్డ కృష్ణవేణి భర్త లోతుగెడ్డ శ్రీరామదూతం గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. గంగాధర్ స్థానిక ఎమ్మెల్యే సోదరుడు కావడంతో అధికారులు సహకరిస్తున్నారని, అందువలన నిర్మాణ పనుల నిలుపుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు.
- శ్రీకాకుళం మండలం బలగ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1/4, 1/5 లో ఉన్న కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బలగకు చెందిన బోనెల చిరంజీవి గ్రీవెన్సులో ఫిర్యాదు చేశారు. సుమారు 1.80 ఎకరాల నాగావళి వరద గట్టు (ప్రభుత్వ భూమి)కి కంచె వేసి కబ్జా చేశారని తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలన్నారు.

సామాన్యులకు ఇబ్బందులు



కలెక్టర్‌కు అర్జీ ఇచ్చేందుకు వేచివున్న పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధులు నేరుగా జిల్లా పరిషత్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్దకు వచ్చి వారి ఫిర్యాదులు ఇచ్చి వెళ్తే ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ వారు నేరుగా జెడ్పీ సమావేశ మందిరంలోని వెయిటింగ్ హాల్‌లో కలెక్టర్, జేసీను ఉంచి వారి ఫిర్యాదులను వివరిస్తే.. ప్రజాప్రతినిధుల కోసం గంటల సమయం కేటాయిస్తే మిగిలిన సామాన్య ప్రజలకు ఇబ్బందులు తప్పవు. అదే పరిస్థితి ఈ సోమవారం పీజీఆర్ఎస్‌లో చోటు చేసుకుంది. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ పలు ఫిర్యాదులతో గ్రీవెన్స్ జరుగుతున్న సమయంలో జిల్లా పరిషత్‌కు రావడం జరిగింది. దీంతో అక్కడ ఉన్న వెయిటింగ్ హాల్‌కు ఆయన కోసం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌లు వెళ్లి సుమారుగా గంట కాలం వెచ్చించారు. దీంతో వచ్చిన అర్జీదారులు ద్వితీయ స్థాయి అధికారులకు వారి సమస్యలు విన్నవించుకునేందుకు ఇష్టపడక గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష సైతం అర్జీ ఇచ్చేందుకు వచ్చి దాదాపు 30 నిమిషాలు పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎస్పీ గ్రీవెన్స్‌కు 43 ఫిర్యాదులు



ఫిర్యాదును పరిశీలిస్తున్న ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 43 ఫిర్యాదులు అందాయి. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వ్యక్తిగతంగా మాట్లాడి, సమస్యలు తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ కాల్ ద్వారా తక్షణమే తెలియజేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులు పునరావృతం కాకూడదని, వాటిపై తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక అందజేయాలని ఆదేశించారు.

బైకు అడ్డగించి దాడి



గాయాలపాలైన రాజారావు

గార: మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన బుగత రాజారావు సోమవారం తెల్లవారుజామున సతివాడ శివాలయానికి వెళ్లి వస్తుండగా కొందరు వ్యక్తులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజారావు దర్శనం పూర్తి చేసుకొని బైక్‌పై వస్తుండగా సతివాడ జంక్షన్ సమీపంలో అదే గ్రామానికి చెందిన కాళ్ల వరాలు, కాళ్ల శేఖర్, మరో ఇద్దరు వ్యక్తులు కత్తి, కర్రలతో దాడి చేశారు. ఆ సమయంలో గుడికి వెళ్లేందుకు భక్తులు రావడం గమనించి వదిలేశారు. బాధితుడికి చెవి, ఎడమ కన్ను, ముఖంపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. గత రెండేళ్లుగా భూమి విషయంలో ఇరు కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

టెక్కలి రూరల్: మండలంలోని నర్సిపురం గ్రామానికి వెళ్లే అప్రోచ్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. టెక్కలి నుంచి నర్సిపురం గ్రామం వైపు కె.రాజా, ఎ.రాము అనే ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళ్తూ నర్సిపురం అప్రోచ్ రోడ్డులోకి తిరుగుతున్న సమయంలో, అదే మార్గంలో మరో ద్విచక్ర వాహనంపై వస్తున్న పి.సుమంత్, ఆర్.రోజాలను ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనాలపై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

మృతదేహం కలకలం



గుర్తు తెలియని మృతదేహం

పలాస: పలాస – కాశీబుగ్గ మున్సిపాలిటీలోని పెంటభద్ర గ్రామానికి వెళ్లే దారిలో కుంకుమ సాగరం వద్ద సోమవారం గుర్తు తెలియని ఒక మృతదేహాన్ని స్థానికులు చూశారు. ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి వెళ్లి పలాస ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తరలించారు. కేసు నమోదు చేసి కాశీబుగ్గ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మిగతా వివరాలు తెలియాల్సి ఉంది.